సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం ¦ 29 ¦ మార్చి ¦ 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36
(శనివారం సాయంత్రం)

సహర్ 4-52
(ఆదివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

'పది' పరీక్షలకు 28 మంది గైర్హాజరు



కందనూలు/ చారకొండ: జిల్లావ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలోని 60 కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించగా 10,584 మందికి గాను 10,556 మంది హాజరవగా.. 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ రమేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు చారకొండ పోలీస్‌స్టేషన్ నుంచి జిల్లాలోని 60 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో డీఈఓ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఎస్‌లు తప్పనిసరిగా పరీక్ష కేంద్రాలను సందర్శించి సిబ్బందికి రోజువారి సూచనలు చేయాలన్నారు. అనంతరం వంగూరు, చారకొండ మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టిసింగ్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అనంతరం చారకొండలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా అధికారులు నర్సింహులు, చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ అధికారి మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన

అచ్చంపేట: బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు శనివారం అచ్చంపేటలో పర్యటిస్తారని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజానాజిమ్‌అలీ అఫ్సర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అచ్చంపేటకు చేరుకొని.. 2 గంటలకు బుడుబుడకల కమ్యూనిటీలతో సమావేశం అవుతారని చెప్పారు.

ప్రశ్నలకు సమాధానం వెతికేదే పరిశోధన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో రెండో రోజు ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్టు వర్క్ రూపకల్పనపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాయికుమార్ మాట్లాడుతూ పరిశోధన అనేది అనేక ప్రశ్నలకు సమాధానం వెతికేదని, పరిణామాత్మక, గుణాత్మక డేటాను విశ్లేషించే ఒక నిర్మాణాత్మక శాస్త్రీయ విధానం అన్నారు. పరిశోధన పద్ధతిని రాయడానికి ముందు పరిశోధన పరిమితులు, నైతిక అందోళనలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మంచి పరిశోధన పద్ధతి పరిశోధన ఫలితాల విశ్వసనీయత, చెల్లుబాటును నిర్ధారించడంలో కూడా సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్.నాగేశ్వర్‌రావు, డాక్టర్ ఎం.కృష్ణయ్య, డాక్టర్ జె.మాళవి, డాక్టర్ ఎ.కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ అర్జున్‌కుమార్, డాక్టర్ జావీద్ మొహమ్మద్‌ఖాన్, డాక్టర్ నాగసుధ తదితరులు పాల్గొన్నారు.

వనరులను వదిలేసి..

గ్రామాల్లో ఇంటి పన్నులతోనే సరిపెడుతున్న అధికారులు



- ఊసేలేని సేవాపన్ను, కొలగారం వంటి సేవల రుసుం
- ఇతర ఆదాయ మార్గాలనూ పట్టించుకోని వైనం
- ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడుతున్న పంచాయతీలు
- 1998-99 నాటి ఇళ్ల రివిజన్ జాబితా ఆధారంగానే పన్నుల వసూలు

కల్వకుర్తి: గ్రామ పంచాయతీల్లో కేవలం ఇంటి పన్నులు, తైబజార్ ద్వారానే నిధుల సమీకరణ జరుగుతోంది. స్థానిక ప్రభుత్వాలు, ప్రభుత్వానికి ఉన్నట్లే గ్రామ పంచాయతీలకు కొన్ని ఆదాయ వనరులు ఉంటాయి. ఇలా వచ్చిన ఆదాయంలో స్థానికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులను కల్పించే స్వేచ్ఛ పంచాయతీలకు ఉంటుంది. కానీ, స్థానిక ప్రభుత్వానికి ఉండే హక్కులు, విధులను స్థానిక అధికారులే విస్మరించడం, ఉన్నతాధికారులు సైతం అవసరం లేదులే అన్నట్లుగా వ్యవహరించడం వంటి పరిణామాలు, స్థానిక ప్రభుత్వాలు అన్న పేరును చులకన చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి 1998- 99 సంవత్సరంలో ఇళ్ల రివిజన్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ఇంటి పన్నుల జాబితాను రివిజన్ చేయాల్సి ఉంటుంది. కానీ, దీనిని ఉన్నతాధికారులు విస్మరించడంతో ఇప్పటికీ పాత జాబితా ఆధారంగానే ఏటా పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు.

ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే..

గ్రామ పంచాయతీలు ఇంటి పన్నులు మాత్రమే ఆదాయ వనరుగా చూస్తూ ఇతరత్రా వనరులను విస్మరిస్తున్నారనే చెప్పాలి. ఫలితంగా ప్రతి పనికి ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించలేక స్థానిక ప్రభుత్వ హోదాను దిగజారుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీల్లో ఆదాయ వనరులపై సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో వసూలు చేస్తే పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టిగా సాధించే అవకాశం ఉంది.

కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం..

ఆస్తిపన్నుతోపాటు పంచాయతీలకు వచ్చే ఇతర ఆదాయ మార్గాలను వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం. పంచాయతీలు గ్రాంట్లు, ఇతరత్రా నిధుల కోసం వేచి చూడకుండా వారే సొంతంగా ఆదాయం సృష్టించుకునేందుకు వీలుంది. ఆ దిశగా అన్ని పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంటుంది.

– రామోహన్, డీపీఓ

సేవా పన్నుపై నిర్లక్ష్యం

గ్రామ పంచాయతీల విభజనకు ముందు ఇంటి పన్నుల రికార్డులు అస్తవ్యస్తంగా నిర్వహించిన కారణంగా ఇంటి నంబర్లు ఇష్టానుసారంగా కేటాయించారు. ఫలితంగా కేటాయించిన ఇంటి నంబర్లు అన్నీ ఆన్‌లైన్‌లో కొంత వరకు నమోదు కాలేదు. గతంలో ఇంటి పన్నులు చెల్లించిన రశీదులు ఉన్నా.. ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు కాని కారణంగా అలాంటి ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేయడం లేదు. అలాంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అది కాస్తా ఇంటి పన్నుల ఆదాయంపై ప్రభావం చూపుతుంది. కానీ, గ్రామ పంచాయతీ ద్వారా ప్రతి ఇంటికి సేవలు అందిస్తున్నందున ఇంటి నంబరు లేని ఇళ్ల నుంచి మెమో నంబర్ 512 ప్రకారం సేవాపన్ను పేరుతో పన్ను వసూలు చేయాలని నూతన పంచాయతీరాజ్ చట్టం–2018లో ప్రభుత్వం పేర్కొంది. కేవలం నూతన ఇంటికి విద్యుత్ సౌకర్యం అవసరమైన సమయంలో అరకొరగా సేవాపన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఆ తర్వాత కూడా ఆయా ఇళ్ల నుంచి నెలకు రూ.200 సేవాపన్ను వసూలు చేయాలన్న నిబంధనలను విస్మరిస్తున్నారు.

అటకెక్కిన కొలగారం

ఏదైనా గ్రామ పంచాయతీలో పండిన పంటను వ్యాపారులు కాంటా పద్ధతిలో కొనుగోలు చేసినప్పుడు సంబంధిత గ్రామ పంచాయతీకి కొలగారం (కాంటా రుసుం) కింద క్వింటాకు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలో ఎక్కడా కొలగారం వసూలు జాడేలేదు. వ్యవసాయ ఆధారిత మండలాలు జిల్లాలో చాలానే ఉన్నప్పటికీ ఈ పద్ధతిలో నిధులు పన్నుల రూపంలోనే సమకూరే అవకాశం ఉంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 కూడా పన్నుల వసూలుకు సంబంధించిన జాబితాలో కొలగారంను అగ్రభాగంలో పేర్కొంది. కానీ, ఉన్నతాధికారులు మొదలు క్షేత్రస్థాయిలో అధికారుల వరకు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల తర్వాత ఆ స్థాయిలో ఆదాయాన్ని అందించే కాంటా రుసుం, లైసెన్స్ ఫీజులు, చేపల చెరువుల వేలం, వారాంతపు సంత, జంతు వధశాలలు తదితర అనేక మార్గాలలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా.. ఏ ఒక్క దానిపై అధికారులు దృష్టిపెట్టకపోవడంతో పంచాయతీల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



ఇఫ్తార్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖాదర్‌పాషా దర్గా వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మంత్రి పాల్గొని ముస్లింలకు ఫలహారం తినిపించి.. సహపంక్తి భోజనాలు చేశారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ముస్లింల అభ్యున్నతికి కృషిచేస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీ బస్సుల ప్రారంభం

కొల్లాపూర్ డిపోకు నూతనంగా మంజూరైన 10 ఆర్టీసీ బస్సులను మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ప్రారంభించారు. వీటిలో ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు ఉంది. బస్సులో కొద్దిసేపు మంత్రి ప్రయాణించారు. ఆర్టీసీ డిపోకు సంబంధించిన పలు అంశాలను ఆర్‌ఎం సంతోష్‌కుమార్, డీఎం ఉమాశంకర్ మంత్రికి వివరించారు. డిపో అభివృద్ధి కోసం ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ భన్సీలాల్, నాయకులు రహింపాష, నయూమ్, అన్వర్‌పాష, ఎక్బాల్, నర్సింహారావు, నాగరాజు, నర్సింహ, కమలాకర్‌రావు, ధర్మతేజ, కిరణ్‌యాదవ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

చిన్నంబావి: మండలంలోని 108 వాహనాన్ని శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, వనపర్తి జిల్లా మేనేజర్ రత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి లేకపోయినా.. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్ నరేందర్, పైలెట్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



నవజాత శిశువుల్లో దృష్టిలోపాలు గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: నవజాత శిశువుల్లో అంధత్వాన్ని నివారించేందుకు దృష్టిలోపాలను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హైదరాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సహకారంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నవజాత శిశువుల్లో కలిగే అంధత్వంపై చిన్నపిల్లల వైద్యులు, స్టాఫ్‌నర్సులు, నేత్రాధికారులకు పునశ్చరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుల్లో కలిగే దృష్టి లోపాలను వెంటనే గుర్తించి, తగిన చికిత్స చేయాలన్నారు. రెటినోపతి సమస్య 37 వారాల కంటే ముందే ప్రసవించిన శిశువులు, శిశువు బరువు రెండు కిలోల కన్నా తక్కువ ఉన్న వారిలో ఏర్పడుతుందన్నారు. పిల్లల్లో రెటినోపతి సమస్యను వెంటనే గుర్తించి తగిన చికిత్స చేయడం వల్ల అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ సాయికిరణ్మయి మాట్లాడుతూ రెటినోపతి లోపం ఉన్న శిశువులకు మందులు, లేజర్ చికిత్స ద్వారా చాలా సులభంగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ బాల మాట్లాడుతూ ప్రతినెలకు ఒకసారి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెటినోపతి సమస్య ఉన్న శిశువుల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిశువుల్లో అంధత్వాన్ని నివారించడంలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రవికుమార్, చిన్నపిల్లల వైద్యులు ఉమాదేవి, ప్రశాంత్, పాండురంగ, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, నేత్రాధికారులు వెంకటస్వామి, వెంకటేష్, బాలాజీ, ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటంకంగా ఊట నీరు

- నిమిషానికి 3,900 లీటర్ల మేర నీరు ఊట
- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- జీఎస్‌ఐ అధికారుల సూచన మేరకు తవ్వకాలు
- లోకో ట్రైన్ ఇంజిన్, బోగి తొలగింపు పనులు వేగవంతం

– అచ్చంపేట

వివరాలు 10లో..



ఉన్నత విద్యకు బాటలు

అభివృద్ధి వైపు పాలమూరు యూనివర్సిటీ పయనం



నిర్మాణ దశలో ఉన్న రీసెర్చ్ ఫెసిలిటీ భవనం

- ఒకే విద్యా సంవత్సరంలో రూ.150 కోట్లు మంజూరు
- పీఎం ఉషా స్కీం ద్వారా రూ.100 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయింపు
- లా, ఇంజినీరింగ్ కళాశాలల భవనాల నిర్మాణంపై దృష్టి
- హాస్టల్స్, ల్యాబ్స్ భవనాలను నిర్మాణానికి శ్రీకారం

యూనివర్సిటీకి బడ్జెట్ కేటాయింపు ఇలా..

సంవత్సరం	ప్రతిపాదనలు	కేటాయింపులు (రూ.కోట్లలో..)
2019- 20	119	6.63
2020- 21	216	7.39
2021- 22	137	7.58
2022- 23	75	9.58
2023- 24	84	10.91
2024- 25	200	50



పీయూ సింథటిక్ ట్రాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న ల్యాబ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన భవనాలు, అధునాతన ల్యాబ్‌లు, వినూత్న కోర్సులతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. యూనివర్సిటీకి గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక మొత్తంలో నిధులు కేటాయింపులు చేయడంతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. యూనివర్సిటీ ప్రారంభం నుంచి విద్యార్థులకు హాస్టళ్లు, తరగతి, గదులు, ల్యాబ్‌లు, గ్రౌండ్స్ వంటివి లేక సతమతమవయ్యే వారు. కానీ, ఈ సంవత్సరం పెద్ద మొత్తంలో నిధుల కేటాయింపుతో భవనాల నిర్మాణానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉషా స్కీం ద్వారా ఇచ్చిన నిధులతో పెద్దఎత్తున భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం సైతం నిర్మాణాల కోసం రూ.35 కోట్లు నిధులు కేటాయించింది. ఈ నిధులతో మరిన్ని భవనాల నిర్మాణాలకు అంచనాలు రూపొందిస్తున్నారు. దీంతో యూనివర్సిటీలో ఉన్నత విద్యకు బాటలు పడుతున్నాయి.

రూ.150 కోట్లు కేటాయింపు..

యూనివర్సిటీ ప్రారంభం నుంచి ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల్లో కేవలం సిబ్బంది వేతనాల కోసమే కేటాయింపులు జరిగివి. 2018లో పీయూలో న్యాక్ గ్రేడింగ్ రావడంతో ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేయగా.. పలు నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో సిబ్బంది వేతనాల కోసం గతేడాది రూ.11 కోట్లు, ఈ సంవత్సరం రూ.15 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇందులో నూతనంగా ప్రారంభించనున్న లా, ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేసే సిబ్బంది వేతనాలు కూడా ఇచ్చారు. గతేడాదితో పోల్చితే రూ.4 కోట్లు అదనంగా ఇవ్వడంతో యూనివర్సిటీపై వేతనాల భారం తగ్గనుంది. ఈ క్రమంలో యూనివర్సిటీ అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు కేటాయించనప్పటికీ అధికారులు యూనివర్సిటీ అంతర్గత నిధులు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి నిధులు సేకరించి అభివృద్ధి పనులు చేపట్టారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు ఒకేసారి కేటాయించడంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతాయని భావిస్తున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గతంలో కేవలం వేతనాల కోసమే ప్రభుత్వం నిధులు కేటాయించేది. కానీ, ఈ సంవత్సరం వేతనాలతో పాటు అభివృద్ధి కోసం కూడా నిధులు వెచ్చించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించడంతో యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తాం. బాలికలకు, బాలురకు ప్రత్యేకంగా హాస్టళ్లు, అకాడమిక్ బ్లాక్, ల్యాబ్స్ నిర్మాణంపై దృష్టిసారిస్తాం. లా, ఇంజినీరింగ్ కళాశాల కోసం కూడా భవనాల నిర్మాణం చేపడతాం. విద్యార్థుల చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధించే విధంగా కొత్త కోర్సులు ప్రారంభించేలా చూస్తాం.

– శ్రీనివాస్, పీయూ వైస్ చాన్స్‌లర్

వసతుల కల్పనపై దృష్టి..

యూనివర్సిటీలో కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రస్తుతం అవసరమైన నిధులు అందుబాటులో ఉండడంతో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్న ఇంజినీరింగ్, లా కళాశాలల భవనాల నిర్మాణం కోసం అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నారు. ఈ రెండు కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం రెండు బాలుర, బాలికల హాస్టళ్లు, ఒక అకామిక్ బ్లాక్‌ను నిర్మించనున్నారు. అన్ని డిపార్ట్‌మెంట్లలో రీసెర్చ్ కోసం రూ.11 కోట్లతో రీసెర్చ్‌ఫెసిలిటీ భవనం, విద్యార్థులను అథ్లెటిక్స్ ప్రోత్సహించేందుకు సింథెటిక్ ట్రాక్, సందర్శకుల కోసం గ్యాలరీ నిర్మిస్తున్నారు. త్వరలో ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

గౌరవ వేతనం ఏది?

- కులగణన పూర్తయ్యి నాలుగు నెలలు గడిచినా అందని డబ్బులు
- ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు తప్పని ఎదురుచూపులు
- జిల్లాలో 2,159 మంది సిబ్బందికి.. రూ.2.19 కోట్లు పెండింగ్



బిజినేపల్లి మండలం పాలెంలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు (ఫైల్)

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం నాలుగునెలల క్రితం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కులగణన కార్యక్రమం చేపట్టింది. ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను కూడా నియమించింది. అయితే ఈ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మాత్రం గౌరవ వేతనం చెల్లించడం లేదు. గతేడాది నవంబర్ 6న ప్రారంభమైన ఈ సర్వే రెండు విడతలుగా కొనసాగింది. సర్వేలో దాదాపు 56 అంశాలతో కూడిన సమాచారాన్ని సిబ్బంది సేకరించారు. ఇందుకోసం సిబ్బంది కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సర్వేను విజయవంతంగా పూర్తి చేశారు.

రూ.2.19 కోట్లు పెండింగ్..

జిల్లాలో చేపట్టిన కులగణన సర్వేలో 1,979 మంది ఎన్యుమరేటర్లు, 180 మంది సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లు ఉన్నారు. అయితే సర్వే కోసం ప్రభుత్వం ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, ఒక్కో సూపర్‌వైజర్‌కు రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. కాగా.. సర్వే పూర్తయ్యి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఈ నిధులు వారికి మంజూరు చేయలేదు. 1,979 మంది ఎన్యుమరేటర్లకు రూ.10 వేల చొప్పున రూ.1,97,90,000, అలాగే 180 మంది సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున రూ.21,60,000 రావాల్సి ఉంది. అంటే మొత్తం 2,159 మంది సిబ్బందికి కలిపి రూ.2,19,50,000 గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ గౌరవ వేతనం విషయంలో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినా ప్రభుత్వం నుండి నిధుల మంజూరు లేకపోవడంతో గౌరవ వేతనాన్ని పొందలేకపోతున్నారు. అయితే ఈ సర్వేలో పాల్గొన్న సిబ్బంది మాత్రం తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనం చెల్లించాలని కోరుతున్నారు. మొదటి విడత సర్వే పూర్తయిన సమయంలోనే గౌరవ వేతనం చెల్లిస్తామని చెప్పినా ఆ హామీ నెరవేరలేదు. కాగా రెండో విడత సర్వే సైతం సిబ్బందితో చేయించారు. రెండు విడతల్లో సర్వే పూర్తి చేసినా ఇంకా గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి గౌరవ వేతనం మంజూరు చేయలని కోరుతున్నారు.

ప్రభుత్వం విడుదల చేస్తేనే..

జిల్లాలో సమగ్ర కులగణన సర్వేలో పాల్గొన్న సిబ్బందికి అందించాల్సిన గౌరవ వేతనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించడం జరిగింది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే సిబ్బందికి డబ్బులు చెల్లిస్తాం.

– భూపాల్‌రెడ్డి, సీపీఓ

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం


చిన్న బుగ్గప్ప (ఫైల్)

మద్దూరు: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్దూరు మండలం నందిపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్ కుమార్ వివరాల మేరకు.. నందిపాడుకు చెందిన బదిగె చిన్న బుగ్గప్ప (50) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతడు ఏ పనిచేయకుండా ఉండటంతో తాగడానికి డబ్బులు పుట్టడం లేదు. ఇంట్లో అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 26న ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోస్గిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు పెద్ద బుగ్గప్ప ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జడ్చర్ల: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన జడ్చర్ల పట్టణంలోని రంగారావుతోటలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. రంగారావుతోటలో పుష్ప (38) అనే మహిళ అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. శుక్రవారం ఆమె కనిపించక పోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికింది. ఈ క్రమంలో ఇంటి ఆవరణలోని సంపును పరిశీలించగా మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల సూచన మేరకు ఫైర్ స్టేషన్ సిబ్బంది మృతదేహాన్ని బయటికి తీశారు. మృతురాలి ఒంటిపై ఎక్కడా గాయాలు ఉన్నట్లు కనిపించలేదని పోలీసులు తెలిపారు. అయితే నీటి సంపు మూత బిగించి ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

కారు బోల్తా.. వ్యక్తి దుర్మరణం


మీర్జా అస్లంబేగ్ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామ ఈద్గా సమీపంలో శుక్రవారం ఉదయం కారు బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గన్‌బజార్‌కు చెందిన మీర్జా అస్లం బేగ్ (42) భార్య షబానాబేగం, కుమారుడు సుభాన్‌బేగ్, కుమార్తె అప్రాతో కలిసి నాగర్‌కర్నూల్‌కు కారులో బయలుదేరారు. పాలెం గ్రామ ఈద్గా వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తాకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న మీర్జా అస్లం బేగ్‌కు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహిత బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని ఈశ్వర్‌కాలనీకి చెందిన పావని (38), భర్త నాగరాజు కొంతకాలంగా గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన పావని శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. అక్క కుమారుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గొండ్యాలలో వృద్ధుడు..

హన్వాడ: మండలంలోని గొండ్యాల్‌లో ఓ వృద్ధుడు శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయిని బాలకిష్టయ్య (65) కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. నొప్పి భరించక శుక్రవారం గ్రామశివారులోని తమ పొలంలో పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి


గమ్లి (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గమ్లి (60) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తండావాసుల కథనం మేరకు.. గమ్లి సోమవారం వంట చెరుకు నిమిత్తం తండా సమీపంలోని అడవికి వెళ్లింది. వంట చెరుకు సేకరించే క్రమంలో విషపు పురుగు కాటు వేసింది. శరీరంపై బొబ్బలు రావడంతో కుటుంబ సభ్యులు బుధవారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. గమ్లికి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆటంకంగా ఊట నీరు


సొరంగం లోపల చేపట్టే సహాయక చర్యలపై సూచనలు, సలహాలు ఇస్తున్న ఉన్నతాధికారులు

నిమిషానికి 3,900 లీటర్ల మేర ఊట
- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- జీఎస్‌ఐ అధికారుల సూచన మేరకు తవ్వకాలు
- లోకో ట్రైన్ ఇంజిన్, బోగి తొలగింపు పనులు వేగవంతం

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనుగొనేందుకు చేపడుతున్న సహాయక చర్యలు మరింత వేగవంతం చేశారు. సొరంగ ప్రమాదం జరిగి శుక్రవారంతో 35 రోజులకు చేరగా.. గురువారం కేరళ కాడవర్ డాగ్స్ చూపిన అనుమానిత ప్రదేశంలో సహాయక సిబ్బంది మట్టిని తొలగిస్తూ తవ్వకాలు మొదలు పెట్టారు. అయితే నిమిషానికి 3,900 లీటర్ల నీరు ఊరుతుండటంతో ప్రతి 2.5 కి.మీ., పాయింట్ వద్ద ఒకటి చొప్పున 150 హెచ్‌పీ సామర్థ్యం గల భారీ మోటారు పంపు సెట్ల ద్వారా బయటకు తోడేస్తున్నారు. నిరంతరాయంగా సాగుతున్న ఈ ప్రక్రియలో మట్టిని తొలగిస్తూ టీబీఎం భాగాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తూ బయటికి పంపిస్తున్నారు. లోకో ట్రైన్ ఇంజిన్ అడ్డంకిగా మారడంతో దానిని కూడా తొలగించే పని కొనసాగుతుంది. ఇంజిన్‌తోపాటు ఉన్న బోగి, ట్రాక్‌పై ఉన్న మట్టిని పూర్తిగా తొలగిస్తే తప్ప సహాయక చర్యలు ముందుకు వెళ్లే అవకాశం కనిపించడం లేదు. సహాయక సిబ్బంది తవ్వకాలు చేపడుతున్న ప్రదేశంలో దుర్వాసన వస్తుందని వారు చెబుతున్నారు. ఈ ప్రదేశంలో కార్మికుల జాడ లభించే అవకాశం ఉందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పరిశీలన

సొరంగం లోపల సహాయక చర్యల్లో భాగంగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని ఎస్‌ఎల్‌బీసీ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం సొరంగం వద్ద జేపీ కంపెనీ కార్యాలయంలో ఉన్నతాధికారులు ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారి వికాస్‌సింగ్, మేజర్ విజయ్‌కుమార్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ కిరణ్‌కుమార్, గిరిధర్‌రెడ్డి, రైల్వే అధికారి చంద్రం, జీఎస్‌ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి నారాయణ, జేపీ కంపెనీ ప్రతినిధులు, బృందాల ఉన్నతాధికారులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని చెప్పారు.



సొరంగం వద్ద సహాయక చర్యలను పరిశీలించేందుకు వస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్

30 మీటర్ల వరకు బారికేడింగ్

జీఎస్‌ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారికేడింగ్ చేస్తూ.. జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు టెలిటెల్, బాక్స్ క్రీప్ స్ట్రక్చర్స్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నారు. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో మట్టి, బండరాళ్ల కింద ఇరుకుపోయిన లోకో ట్రైన్ క్యాబిన్లు రెండు రోజుల నుంచి తొలగిస్తూ లోకో ఇంజిన్ బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాద ప్రదేశంలో ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లను ఎస్కవేటర్ల ద్వారా తొలగిస్తూ టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ ద్వారా కట్ చేస్తున్నారు. సహాయక సిబ్బంది చేపట్టిన తవ్వకాల్లో వచ్చిన మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు.

బలహీనవర్గాల పక్షాన పోరాడుతా

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నాగర్‌కర్నూల్: బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతైనా పోరాడుతానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ బాధితులు నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ వర్గాల ప్రజలకు చెందిన దాదాపు రూ.150 కోట్ల వరకు మోసం జరిగిందని.. బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఫైనాన్స్ కంపెనీకి ఏప్రిల్ 8 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నానని.. ఆలోపు బాధితులకు డబ్బులు చెల్లించకపోతే అసలైన యుద్ధం ఎలా ఉంటుందో చూస్తారని హెచ్చరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అంతకుముందు కొందరు బాధితులు ఫైనాన్స్ మోసం చేసిన తీరును ఆయనకు వివరించారు. అనంతరం ఆయనే బాధితుల వద్దకు వెళ్లి ఎవరెవరికి ఎంత డబ్బు రావాలో అడిగి రాసుకున్నారు. బాధితుల తరఫున నిలబడి డబ్బులు తిరిగి ఇప్పిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని తీన్మార్ మల్లన్న బృందం పాల్గొంది.

బాధితుల తరఫున మాట్లాడొద్దన్నారు..

శ్రీసాయిరం ఫైనాన్స్ సంస్థ చేతిలో మోసపోయిన బాధితులకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కనీసం మాట్లాడడం లేదని తీన్మార్ మల్లన్న విమర్శించారు. పైగా బాధితుల తరఫున సమావేశం పెట్టవద్దని ఓ మంత్రి ఫోన్‌చేసి మరీ చెప్పారని సంచలన ఆరోపణలు చేశారు. పత్రికల్లో, టీవీల్లో కూడా పెద్దోళ్ల వార్తలు వస్తాయే గానీ పేదోళ్ల వార్తలు రావని తెలిపారు. దొంగతనం చేసింది, ఫైనాన్స్ పేరుతో పొమ్ము ఎత్తుకెళ్లింది కూడా పెద్దలేనని అన్నారు. మల్లన్న ఇక్కడ మీటింగ్ పెడితే పరేషాన్ అయితదని మంత్రి సమావేశం పెట్టవద్దని అంటున్నారని తెలిపారు.

గంజాయి సరఫరా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష



మహబూబ్‌నగర్ క్రైం: సిగరెట్లలో తడిపి ఉపయోగించే గంజాయి ఆయిల్ కేసులో పట్టుబడిన ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఒక్కొక్కరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన గంజాయి సప్లయ్‌దారు బోకురూప్‌రాయ్ దగ్గర అదే రాష్ట్రంలోని ఖలీమేలా ఏరియాకు చెందిన నారోత్తమ్ రాయ్, ధర్మేంద్రకుమార్ రాయ్ అనే యువకులు కలిసి రూ.25 లక్షల విలువ చేసే గంజాయి నుంచి వెలికితీసిన 5 కిలోల హాషిష్ ఆయిల్ (ద్రవరూపంలో ఉండే గంజాయి) కొనుగోలు చేశారు. ఆ తర్వాత సదరు ఆయిల్‌ను తీసుకుని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా మార్గమధ్యలో మహబూబ్‌నగర్ బైపాస్ దగ్గర ముందస్తు సమాచారంతో హైదరాబాద్ ఎస్‌టీఎఫ్ పోలీసులు 2024 అక్టోబర్ 3న మధ్యాహ్నం పట్టుకున్నారు. వీరు ఒడిశా నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాయిచూర్ ప్రాంతాల్లో ఉన్న గంజాయి వినియోగదారులకు గంజాయి ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందని, అధిక మొత్తంలో ఎండు గంజాయి నుంచి ఆయిల్ తయారు చేస్తారని నిర్ధారించారు. చిన్న పాకెట్లు, డబ్బాలలో ఆయిల్ ప్యాక్ చేసి వినియోగదారులకు విక్రయిస్తుంటారని, దీనిని కస్టమర్స్ సిగరెట్లలో డ్రాప్స్ రూపంలో వేసుకుని తాగడంతోపాటు సిగరెట్ పేపర్‌ను ఈ ఆయిల్ తడిపి తాగుతారని నిర్ధారణ అయ్యింది. సాధారణ గంజాయి కంటే పది రెట్ల మత్తు ఈ ఆయిల్ తాగే వినియోగదారులకు లభిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐటీ ప్రొఫెషనల్స్, మెడికల్, ఉన్నత ఉద్యోగులు దీనిని వాడుతుంటారని సమాచారం. ఈ కేసు నమోదు చేసి ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో సమర్పించారు. ఈ కేసు శుక్రవారం కోర్టుకు రావడంతో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి కేసు వాదనలు పూర్తయిన తర్వాత నేరం రుజువు కావడంతో నారోత్తమ్ రాయ్, ధర్మేంద్రకుమార్ రాయ్‌లకు ఒక్కొక్కరికి పదేళ్ల జైలుశిక్ష రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే మళ్లీ అదనంగా ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు కారాగార శిక్ష విధించడం జరుగుతుందని తీర్పులో వెల్లడించారు. శిక్షపడిన ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

చేపల వలలో చిక్కుకొని యువకుడి మృతి


నాగరాజు

అమరచింత: చేపల వలలో చిక్కుకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం నందిమళ్ల గ్రామానికి చెందిన నాగరాజు గ్రామం సమీపంలోని చెరువులో చేపల వేట కోసం బెండు తీసుకుని వలతో నీటిలో దిగాడు. వల విసురుతున్న సమయంలో బెండుపై నుంచి జారి కిందపడ్డాడు. దీంతో చేపల వల శరీరం మొత్తం చుట్టుకోవడంతో ఈదలేక పోయాడు. ఎంత ప్రయత్నించినా తప్పించుకునే వీలు లేక నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య పావనితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తమ్ముడి ప్రేమకు సహకరించాడనే నెపంతో..

అన్నపై మరణాయుధాలతో యువతి బంధువుల దాడి


పెద్దరాజమూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ నాగన్న


దాడిలో గాయపడిన రవికుమార్

దేవరకద్ర రూరల్: ప్రేమ విషయంలో తమ్ముడికి సహకరించాడనే నెపంతో యువతి తరఫు బంధువులు మరణాయుధాలతో దాడి చేసిన ఘటన దేవరకద్ర మండలం పెద్దరాజమూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. పెద్దరాజమూర్‌కు చెందిన అరుణ్ కుమార్‌కు రెండేళ్ల క్రితం మణికొండకు చెందిన యువతితో వివాహం కాగా.. అనారోగ్య కారణాలతో ఆమె ఏడాది క్రితం మృతిచెందింది. అయితే ఐదు నెలల క్రితం గూరకొండకు చెందిన అమ్మాయితో అరుణ్‌కుమార్ ప్రేమాయాణం నడుపుతూ ఇంటికి తీసుకువచ్చాడు. అతడి వేధింపులు తాళలేక ఆమె తిరిగి వెళ్లిపోయింది. ఇదిలా ఉంటే, మూడు నెలల క్రితం పెద్దరాజమూర్‌కు చెందిన మరో అమ్మాయిని ప్రేమ పేరుతో తీసుకెళ్లాడు. అమ్మాయి తరఫు బంధువులు వారిని వెతికి తీసుకువచ్చి.. పది రోజుల క్రితం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. యువకుడికి ఇంతకుముందే వివాహం జరగడంతో యువతి తరఫు వారు పెళ్లికి ఒప్పుకోలేదు. చేసిన తప్పునకు గాను యువతి కుటుంబానికి జరిమానా చెల్లించాలని సదరు యువకుడి కుటుంబానికి పెద్దలు సూచించారు. అయినప్పటికీ ఆ యువకుడి ప్రవర్తనలో మార్పు కనిపించక పోవడంతో శుక్రవారం యువతి కుటుంబానికి చెందిన తాత ఆంజనేయులు, తండ్రి మైబు, బాబాయ్ మాధవులు మరణాయుధాలతో యువకుడి ఇంటిపైకి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో అరుణ్‌కుమార్ అన్న రవికుమార్ ఒక్కడే ఉన్నాడు. అయితే జరిగిన ఘటనలో రవికుమార్ పాత్ర కూడా ఉందని ఆరోపిస్తూ అతడిపై మరణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడి తల, భుజం వద్ద తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సీఐ రామకృష్ణ గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, బాధితుడిని జిల్లా ఆస్పత్రిలో ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, దొబ్బలి ఆంజనేయులు పరామర్శించారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు..


విద్యార్థి హేమంత్

మన్ననూర్: తండ్రి మరణించడంతో వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకొని ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరైన సంఘటన శుక్రవారం మన్ననూర్‌లో చోటు చేసుకుంది. మన్ననూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి హేమంత్ తండ్రి లఖ్యా శుక్రవారం మరణించాడు. తండ్రి మరణాన్ని దిగమింగుకుంటూ.. తప్పని పరిస్థితిలో ఫిజికల్ సైన్స్ పరీక్షకు హాజరయ్యాడు. ఆ విద్యార్థికి హెచ్‌ఎం సిద్ధార్థ మహదేవ్, ఉపాధ్యాయులు మనోధైర్యాన్ని ఇచ్చి పరీక్ష రాయించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ధరూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఓ వ్యక్తికి రూ.10 వేల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ధరూరుకు చెందిన మాల బీసమ్మ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేది. ఆమె అప్పట్లో చాకలి వెంకటన్న వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే సదరు మహిళ మరో ఇద్దరు వ్యక్తులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నావని దూషించడంతో.. మనస్తాపానికి గురైన ఆమె ఇంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు అప్పటి డీఎస్పీ బాలకోటి, సీఐ సురేష్, ఏఎస్‌ఐ విశ్వనాథం చాకలి వెంకటన్నపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టులో కేసుపై విచారణ జరగగా.. న్యాయమూర్తి శారదదేవి నిందితుడు చాకలి వెంకటన్నకు రూ.10 వేల జరిమానాతోపాటు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పెట్రోల్ బంక్‌లో చోరీ

మల్దకల్: మండంలోని అమరవాయి గ్రామ సమీపంలో ఇటీవల ఏర్పాటుచేసిన పద్మావతి పెట్రోల్ బంక్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పెట్రోల్ బంక్ నిర్వాహకుల వివరాల మేరకు.. బొలెరో వాహనంలో వచ్చిన ఏడుగురు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న యువకులను ఓ గదిలో నిర్బంధించి, రూ. 1.42లక్షలను చోరీ చేశారు. అదే విధంగా సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. వాటి విలువ రూ. లక్షకు పైగా ఉంటుందని పెట్రోల్ బంక్ యజమాని గంగాధర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని గద్వాల సీఐ టంగుటూరు శ్రీను, ఎస్‌ఐ పరిశీలించారు.

నర్సింగ్ విద్యార్థి బలవన్మరణం


మనిదీప్ (ఫైల్)

రాజాపూర్ (బాలానగర్): చదువు పూర్తి చేసుకుని తమకు అండగా నిలుస్తాడనుకున్న కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. బాలానగర్‌కు చెందిన చరమోని శివరాజ్ ఆటో నడుపుతూ ఇద్దరు కూతుళ్లు, కుమారుడు మనిదీప్(18)ను చదివించుకుంటున్నాడు. అయితే మనిదీప్ హైదరాబాద్‌లో ఓ యునివర్సిటీలో నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం కళాశాలకు వెళ్లి వచ్చి రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం తన రూంలోకి వెళ్లి పడుకున్నాడు. ఉదయం ఎంతకీ పిలిచినా లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులను పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆత్మకూర్ మండలం ఆరేపల్లి సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ వివరాల మేరకు.. ఆరేపల్లికి చెందిన గొల్ల వెంకటేష్ (44) గ్రామ సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా.. గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల మార్చురీకి తరలించారు.

చిరుత దాడిలో లేగ మృతి

మద్దూరు: పట్టణ శివారులో వారం రోజులుగా చిరుత సంచారం కొనసాగుతోంది. గురువారం రాత్రి తలారి రాములు ఎలగల గట్టు దగ్గర ఉన్న తన పొలంలో పశువులను కట్టివేసి ఇంటికి వచ్చాడు. అదేరోజు రాత్రి చిరుత దాడిచేయడంతో లేగ మృతిచెందింది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గద్వాల క్రైం: అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు గద్వాల సీఐ శ్రీను శుక్రవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు సీఐ కథనం ప్రకారం.. ఈ నెల 8న గద్వాలలోని హమలీకాలనీకి చెందిన కుర్వ పరశురాముడు ఇంట్లో గుర్తుతెలియని దుండగులు బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే శుక్రవారం ఉదయం పట్టణ శివారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన సల్కాపురం రాజు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడన్నారు. అయితే కొన్ని రోజుల క్రితం జిల్లాకేంద్రంలోని ఆరు ఇళ్లలోకి చొరబడి ఇంట్లోని బంగారు ఆభరణాలు అపహరించినట్లు నిందితుడు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై కర్నూలు పట్టణంతోపాటు జిల్లాలోని ఓర్వకల్లు పోలీసుస్టేషన్‌లో చోరీ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిందితుడు పలు చోరీలకు పాల్పడిన క్రమంలో 18 తులాల బంగారు ఆభరణాలు అపహరించాడన్నారు. నిందితుడి నుంచి 3 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగిలించిన 9 తులాల బంగారు ఆభరణాలను పలు ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకులలో, మరో ఆరు తులాల బంగారు ఆభరణాలను తెలిసిన వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టాడన్నారు. త్వరలో వారి నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేస్తామన్నారు. నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ చెప్పారు. కేసు ఛేదనలో పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్, సాంకేతిక విభాగ సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయిల్ కీలకంగా వ్యవహరించారన్నారు.

కల్లు డిపోపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 150 పెట్టెల కల్లు స్వాధీనం
- పరారీలో నిర్వాహకులు

గద్వాల క్రైం: గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్‌లోని కల్లు డిపోపై శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. శెట్టి ఆత్మకూర్‌లో కొన్ని నెలలుగా అనుమతి లేకుండా కల్లు డిపో ఏర్పాటు చేసుకుని వివిధ గ్రామాలకు కల్తీ కల్లును సరఫరా చేస్తున్నారు. అయితే అనుమతి లేకుండా కొనసాగుతున్న కల్లు విక్రయాలను కట్టడి చేయడంలో గద్వాల ఎక్సైజ్ అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడంతో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు బృందాలుగా ఏర్పడి కల్లు డిపో, కల్లు విక్రయాలు చేస్తున్న అంగళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 150 పెట్టెల నిషేధిత కల్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వస్తున్నట్లు ముందే గుర్తించిన నిర్వాహకులు కలు డిపో, అంగళ్లను మూసివేసి పరారీ అయ్యారు. అయితే దాడుల విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. నడిగడ్డ అధికార పార్టీలో రెండు గ్రూపులకు చెందిన కల్లు వ్యాపారులు కల్లు విక్రయాలు చేస్తున్నారు. కల్లు తయారీకి విషపూరితమైన మత్తు పదార్థాలు కలిపి కల్లును తయారు చేస్తున్నారు. ఈ విషయంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ అధికారిని 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు. గద్వాల ఎక్సైజ్ అధికారులు మాత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. దాడుల వివరాలపై స్పష్టత లేదని పేర్కొంటున్నారు. అయితే నిషేధిత కల్లు విక్రయాలపై ఇప్పటికే జిల్లాలోని పలువురిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల వ్యవహారం రాష్ట్రస్థాయిలో సంచలనంగా మారింది.